ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

విద్యాధరపురం... విందిపేట(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల తక్షణ పరిష్కార వేదికగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతుందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి 49వ డివిజన్‌లోని 167వ సచివాలయ పరిధి కొండప్రాంతంలో పర్యటించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతంలోని చిట్టచివరి ఇల్లు వరకు ప్రతి ఒక్క నివాసాన్ని సందర్శించి గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందుతున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతంలో ముఖ్యంగా డ్రెయినేజీలు, మెట్ల మార్గాలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావటంతో వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సచివాలయ నిధులతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. డివిజన్ వ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకుంటున్నప్పటికీ ఒకరిద్దరికి సాంకేతిక కారణాలతో పెన్షన్‌లు నిలిచిపోయినట్లు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దీనిపై అధికారులు లోపాలను సరిచేసి వారికి కూడా పెన్షన్‌లు అందించే ఏర్పాట్లు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అర్హతే కొలమానంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన ప్రతి ఇంటికి తమకు స్వాగతం పలుకుతూ రానున్న రోజుల్లో కూడా వైఎస్సార్ సీపీ వైపే తామంతా ఉంటామని చెప్పడం తమ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందన్నారు. అనంతరం 1వ తేదీ కావటంతో ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. 49వ డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతూ ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. 167వ సచివాలయ పరిధిలో 780 రైస్‌కార్డుల్లో 646 హెల్త్‌కార్డులు, 890 ఇంటి స్థలాల్లో 348 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. వాటితో పాటు అమ్మ ఒడి, చేదోడు, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు లబ్ధి పొందుతున్నారన్నారు. ముఖ్యంగా కొండ ప్రాంత చిట్టచివరి కొంతమంది నివాసితులు తమకు రిటైనింగ్ వాల్ నిర్మాణం గురించి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కానీ అక్కడ నిర్మాణాలకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో సాధ్యం పడే పరిస్థితి లేదని చెప్పారు. అందుకోసం ప్రత్యామ్నాయంగా వారికి మరో చోట ఇళ్లు కేటాయించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చేపూరి శ్రీనివాసరావు, బూదాల శ్రీనివాసరావు, యర్రజోన్న విజయలక్ష్మి, ప్రమిల, జార్జి, మార్కు, బంకా శివ, షేక్ గౌస్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు



మహిళకు సపర్యలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

క్షతగాత్రురాలిని ఆదుకున్న ఎమ్మెల్యే..

చిట్టినగర్ ఎర్రకట్టరోడ్డులో ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఆ సమయంలో గడప గడప కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి చూసి వెంటనే మహిళలకు సపర్యలు చేసి తన సొంత వాహనంలో ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో 108కి ఫోన్ చేశారు. సమయం గడుస్తున్న అంబులెన్స్ రాకపోవడంతో తమ అనుచరులతో ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఫోన్‌లో బాధిత మహిళ యోగక్షేమాలు తెలుసుకున్నారు.

క్లుప్తంగా

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించి పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న సెంటర్లపై దాడులు నిర్వహించి లైసెన్స్‌లు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఉన్న 252 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. 3 సెంటర్లు రిజిస్ట్రేషన్లకు దరఖాస్తు చేసుకోగా కమిటీ ఆయా దరఖాస్తులను పరిశీలించి నిబంధనకు అనుగుణంగా లేకపోవడంతో అనుమతులు మంజూరు చేయలేదన్నారు. 5 సెంటర్లు రెన్యువల్, 12 సెంటర్ల మాడిఫికేషన్‌కు అనుమతులను మంజూరు చేశామని చెప్పారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జస్టిస్ వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ.. కొత్తగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, చేర్పులు మార్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కమిటీకి నివేదించాలన్నారు. సమావేశంలో డీసీపీఎంఎస్ బాబు, కమిటీ కన్వీనర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య మహిళా మండలి సెక్రటరీ రష్మీ, డీపీఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. చిట్టినగర్ జంక్షన్‌లో వాహన చోదకులకు బుధవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారితో పాటు ట్రిపుల్ రైడింగ్, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే యువకులు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్-1 సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేట ఎస్ఐలు, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని భవానీపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎండీ ఉమర్ అన్నారు. బుధవారం సాయంత్రం భవానీపురం స్వాతి థియేటర్ సెంటర్‌లో జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులను ఆపి గులాబీ పూలు అందచేస్తూ ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. 'తల మీదే.. రక్షణా మీదే' అన్న నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనదారుడు మాత్రమే మరణించటమో లేదా అవయవాలను కోల్పోడమో జరుగుతుందన్నారు. వాటిని నివారించేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తీరాలన్నారు. తలకు ధరించే శిరస్త్రాణం భారం కాదని, బాధ్యతగా భావించాలన్నారు. ఎస్ఐ అనూష, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ అర్జునరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం ఉత్తమం



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఉత్తమమైనదని డాక్టర్ సమరం పేర్కొన్నారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం మాట్లాడుతూ.. మనిషి ప్రాణాన్ని కాపాడేది రక్తమేనన్నారు. రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. శిబిరంలో 77 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎం.ఏసుదానం, డెప్యూటీ సీటీఎంలు జాన్ సుధకర్, బషీర్ అహ్మద్, ఆర్టీసీ జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణకుమారి, వివిధ డిపోల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేకువ జాము నుంచే పింఛన్ల అందజేత



49వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేకువ జాము నుంచే లబ్ధిదారుల తలుపు తట్టి వార్డు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు అవ్వాతాతలకు గుడ్ మార్నింగ్ చెప్పి పింఛన్ అందజేశారు. తాము ఇంకా నిద్ర లేవక ముందే వచ్చి పింఛన్ అందచేసే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అవ్వ, తాతలు కృతజ్ఞతలు తెలిపాయి. వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యాధరపురం 38వ డివిజన్ 194 వార్డు సచివాలయం పరిధిలో కన్వీనర్ ఎస్‌కే నజీర్ వలంటీర్‌తో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. భవానీపురంలోని 126వ వార్డు సచివాలయం పరిధిలో వెల్ఫేర్ సెక్రటరీ నరెడ్ల రమ్యతో వలంటీర్ దుర్గా చామంత్ షిర్డీ అవ్వాతాతల నివాసాలకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. చిట్టినగర్ 47వ డివిజన్ 147వ వార్డు సచివాలయం కన్వీనర్లు దేరంగుల వెంకట రమణ, ఇల్లిపిల్లి విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్‌లు వలంటీర్‌ను వెంటపెట్టుకుని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే దూరప్రాంతంలో ఉన్న కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, అదీ నాలుగైదు రోజులు కేంద్రం చుట్టూ తిరిగితేగానీ నతదు వచ్చేది కాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప వద్దే పింఛన్ పొందుతున్నామని, వారు ఆనందం వ్యక్తం చేశారు.



47వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న కన్వీనర్లు దేరంగుల, మద్దిరాల, ఇల్లిపిల్లి

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ బ్రాహ్మణ వీధిలో వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణోత్సవాన్ని అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం యజ్ఞశాల ప్రవేశం, వాస్తుపూజ, హోమాల, అగ్ని ఆరాధన తదితర వైదిక కార్యక్రమాలను జరిపారు. బ్రహ్మోత్సవాలు, భీష్మ ఏకాదశి, బ్రహ్మోత్సవం కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పలు ప్రత్యేక హోమాలను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతాలను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభానికి గరుడపటాన్ని ముద్రించిన పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ చేశారు. ఆలయ అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్ బాబు పర్యవేక్షించారు.



శేషవాహన సేవలో శ్రీవారు

ఘనంగా శేషవాహనసేవ

స్వామి వారి శేషవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శేషవాహనాన్ని రమణీయంగా అలంకరించారు. అందులో ఉభయదేవేరులతో కూడిన స్వామి వారిని అధిష్టింపజేసి ఊరేగింపు నిర్వహించారు.

కట్టుదిట్టంగా యాంటీ లార్వా ఆపరేషన్



డ్రమ్ముల్లో నీటిని ఖాళీ చేయిస్తున్న బయాలజిస్టు సూర్యకుమార్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ప్రతి డివిజన్‌లో యాంటీ లార్వా ఆపరేషన్ పనులను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని నగరపాలకసంస్థ బయాలజిస్టు సూర్యకుమార్ పేర్కొన్నారు. 46వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతాలు, వీఎంసీ కాలనీ, రాజీవ్‌శర్మనగర్, దినదయాళ్‌నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో పర్యటించిన సందర్భంలో ఇంటి ముందు నీటిని నిల్వ ఉంచిన డ్రమ్ములు, నీటి తొట్టెలను పరిశీలించారు. డ్రమ్ముల్లో నీటిని ఎన్ని రోజులుగా నిల్వ ఉంచారని అడిగి తెలుసుకోవడంతో పాటు నీటిని పరిశీలించారు. వీఎంసీ కాలనీలోని కొన్ని ఇళ్ల ముందు నిల్వ ఉంచిన నీటిలో దోమల ల్వారా పెరుగుతుండటంతో వెంటనే ఆ నీటిని పారబోశారు. లార్వా పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించి, యాంటీ లార్వా ఆపరేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. కేటీ రోడ్డులోని పలు వీధుల్లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులు, కల్వర్టు కింద నీటిని పరిశీలించి వెంటనే ఆయిల్‌బాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఫాగింగ్ చేయాలని చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామ్మోనరావు, మలేరియా సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్ల నిర్మాణం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మాధురీ లావణ్య, స్థానికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతంలో నివసించే పేద ప్రజల సౌకర్యార్థం మెట్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య తెలిపారు. విద్యాధరపురం కబేళా సెంటర్‌లోని తిరుపతమ్మ గుడి కొండ ప్రాంతంలో రూ.5,40,000ల వ్యయంతో నిర్మించనున్న మెట్లు, సైడు డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఆమె బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొండ ప్రాంతవాసులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి స్థానికుల సమస్యలను పరిష్కరించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, ముత్తా వాసు, బొప్పినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, గుండు లక్ష్మి, రవ్వా కోటేశ్వరి, సచివాలయ సెక్రటరీ బుచ్చిబాబు, కాంట్రాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సే నో టు డ్రగ్స్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు సూచించారు. 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమంలో భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన యువకులకు స్థానిక పోలీస్‌కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. డ్రగ్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మానసిక వైద్యులు శంకర్, శ్రావణి, తేజోవతి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జి.వి.రమణమూర్తి, సీఐలు శ్రీధర్‌కుమార్, నాగశ్రీనివాస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఈఎస్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థుల సహకారంతో ఎన్టీఆర్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గంజాయి లేదా మాదక ద్రవ్యాల అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణాకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే తమకు తెలియ చేయాలని, అదే విద్యార్థులు అందించే సహకారమన్నారు. మాదక ద్రవ్యాలు, మద్యం వినియోగం, వాటి అక్రమ రవాణాపై గొల్లపూడిలోని శ్రీశాస్త జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో చైతన్యం వచ్చినప్పుడే డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టవచ్చని చెప్పారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఎన్.సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హజ్రత్ సయ్యద్ షాబూఖారీ బాబా దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా అన్నారు. దర్గా 426వ ఉరుసు ఉత్సవాల్లో బుధవారం వారు వేర్వేరుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. బాబా వారికి చాదర్ సమర్పించారు. ఆస్థాన పీఠాధిపతి, సూఫీ మతగురువు మహ్మద్ అల్తాఫ్ రజా సాదరంగా ఆహ్వానం పలికారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిత్యం జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని కొనియాడారు. వేడుకల్లో ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాజా, హిస్టరీ, అకాడమీ డైరెక్టర్ వాజిద్‌ఖాన్, 54వ డివిజన్ కార్పొరేటర్ హర్షద్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



విజేతకు బహుమతి అందజేస్తున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలని భీమవరం ఒకటవ అదనపు న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్ అన్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ (డీఎస్ఎమ్) పూర్వ విద్యార్థి, న్యాయమూర్తి పవన్‌కుమార్ బుధవారం పాఠశాలకు విచ్చేశారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ముని మనుమడు మునిపల్లె వెంకటేశ్వరరావుతో కలిసి పవన్‌కుమార్ డీఎస్ఎం హైస్కూల్‌లో 1981-86లో చదువుకోగా వెంకటేశ్వరరావు కోవిడ్ కారణంగా మరణించటంతో ఆయన జ్ఞాపకార్థం మిత్రుడు న్యాయమూర్తి పవన్‌కుమార్ విద్యార్థులకు స్నేహం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. హైస్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ స్నేహితుడు కేబీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, మురళీ ప్రసాద్, భానుప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పైపులరోడ్డు మీదుగా ఆటోనగర్‌కు సిటీ బస్సు సర్వీసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీ నుంచి పైపులరోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు మీదుగా ఆటోనగర్‌కు 33జే సిటీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు విద్యాధరపురం డిపో మేనేజర్ కనకమేడల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీ వాసుల అవసరాలను పరిగణలోకి తీసుకుని జక్కంపూడి కాలనీ నుంచి నూతనంగా 33జే సర్వీసును నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. 40 నిమిషాల వ్యవధిలో మొత్తం నాలుగు బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. జక్కంపూడి కాలనీ, పైపుల రోడ్డు, డాబాకొట్లు సెంటర్, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్, బీఆర్టీఎస్ రోడ్డు, గుణదల, కొత్త గవర్నమెంట్ హాస్పిటల్, బెంజ్‌సర్కిల్, పటమట, ఆటోనగర్ మీదుగా బస్సు సర్వీసు నడుస్తుందన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులకు పాల్పడుతున్న భర్తపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమ్మిన కృష్ణయ్య వీధికి చెందిన కొడాలి లిల్లీమేరీ(25) 2014లో నాంచారయ్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది. నాంచారయ్య ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత నాంచారయ్య భార్యను అనుమానిస్తూ వేధింపులకు పాల్పడసాగాడు. దీంతో లిల్లీ మేరీ పెద్ద కుమారుడిని తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. భర్త వేధింపులపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యాంకులు లక్ష్యాలను చేరుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు పథకానికి బ్యాంకులు బ్రాంచీల వారీగా లక్ష్యాలను చేరుకోవాలని వీఎంసీ పట్టణ సాధికారికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి(పీఓ) శకుంతల తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో బ్యాంకర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023 - 24 ఏడాదికి స్వయం సహాయక సంఘాలు గ్రూపులను యూనిట్‌గా తీసుకుని రుణ అర్హత లేకున్నా ఆయా సంఘాలను లక్ష్యంగా చేసుకుని వారికి ఈ ఏడాది జగనన్న తోడు పథకం వర్తింపజేయాలన్నారు. బ్యాంక్ ఎల్‌డీఏ సత్యనారాయణ, యూసీడీ విభాగ సిబ్బంది సీడీఓలు, టీఈలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): భక్తుల కోర్కెలు తీర్చే బంగారు తల్లిగా గుణదల మాత నీరాజనాలందుకుంటుందని రీజనల్ సుపీరియర్ ఇండియా రెవ. ఫాదర్ మార్నెని రవితానయ్య అన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనల రెండో రోజైన బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరియమాత బలి పీఠం వద్ద సమష్టి దివ్య పూజ నిర్వహించారు. అంతకు ముందు పుణ్య క్షేత్ర గురువులు, మఠ కన్యలు, పలు విచారణల నుంచి వచ్చిన విశ్వాసులు కొవ్వొత్తులు చేతబూని కొండపైకి చేరుకున్నారు. జపమాల ధ్యానంతో మరియ తల్లిని వేడుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ విజయ కుమార్ పాల్గొన్నారు.

పాప్ కార్న్ చిత్రం యూనిట్ సందడి



మాట్లాడుతున్న హీరోయిన్ అవికా గోర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాప్ కార్న్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం యూనిట్ సభ్యులు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ పాప్‌కార్న్ చిత్రం యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. సినిమాలో ఎక్కువ భాగం ఒక లిఫ్ట్‌లోనే చిత్రీకరించామని చెప్పారు. లిఫ్ట్‌లో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. దర్శకుడు మురళీ కొత్త దర్శకుడు అయినప్పటికీ ఈ చిత్రాన్ని ఒక ప్రతిభగల దర్శకుడు మాదిరిగా చిత్రీకరించారన్నారు. హీరో సాయి రోనక్ మాట్లాడుతూ తాను నాలుగు చిత్రాల్లో హీరోగా నటించానని, తొలిసారిగా అవికా గోర్ లాంటి సీనియర్ హీరోయిన్‌తో నటించడం సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని యువతతో పాటు కుటుంబ సభ్యులందరూ కూడా చూసే చిత్రమని తెలిపారు. దర్శకుడు మురళీ మాట్లాడుతూ.. తను చాలా షార్ట్ ఫిల్మ్స్ చేశానని, ఆ అనుభవంతో తొలిసారిగా పాప్ కార్న్ చిత్రం తీశానన్నారు. సమావేశంలో చిత్ర సహ నిర్మాత చలపతిరాజు పాల్గొన్నారు.